# చిత్రమైన లిఖితం

## క్యాన్వాస్ పెయింటింగ్‌లో ప్రత్యేకం

రాష్ట్ర, జాతీయ స్థాయిలో వరించిన అనేక బహుమతులు

**ఆ బాలిక పెన్సిల్ వర్క్స్ వేయడంలో దిట్ట. ఆక్రిలిక్ కలర్స్‌తో క్యాన్వాస్ పెయింటింగ్‌లో ప్రత్యేక శైలిని కనబర్చుతూ ఔరా అనిపించుకుంటున్నది. ఓ వైపు చదువుకుంటూనే మరో వైపు సామాజిక దర్పణం పట్టేలా చిత్రాలు వేస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక బహుమతులు గెలుచుకున్నది మిర్యాలగూడ పట్టణానికి చెందిన లిఖిత.**

– మిర్యాలగూడ టౌన్, డిసెంబర్ 17



చిత్రాలు వేస్తున్న లిఖిత

మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన కమటం మధు, దీప్తి దంపతుల కుమార్తె లిఖిత ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్నది. ఆమెకు చిన్నతనం నుంచే చిత్రలేఖనంపై ఆసక్తి ఉండేది. అది గమనించిన తల్లిదండ్రులు పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు ఇనుగుర్తి విజయ్‌కుమార్ వద్ద చిత్రలేఖనం తరగతులకు పంపించారు. అక్కడ రెండు సంవత్సరాలుగా ఆయిల్ పెయింట్, డ్రాయింగ్, పెన్సిల్ వర్క్స్, వాటర్ కలర్స్, క్యాన్వాస్ పెయింటింగ్ నేర్చుకుంటున్నది. ఈ క్రమంలో వివిధ విద్యాసంస్థలు నిర్వహించే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి అనేక బహుమతులు, పతకాలను గెలుచుకున్నది. లిఖిత వేసిన దాదాపు వందకుపైగా చిత్రాలు సామాజిక దర్పణం పట్టేలా ఆకర్షణీయంగా ఉన్నాయి. వాటర్ కలర్స్‌తో వేసిన చిత్రాల్లో ప్లాస్టిక్ నిషేధం, పల్లె వాతావరణం, సేవ్ వాటర్, సేవ్ ఎర్త్, పర్యావరణం, ఆడ పిల్లలపై వేసిన చిత్రాలు ఆలోచింపజేస్తున్నాయి. కాగా, తాను వేసిన చిత్రాలతో భవిష్యత్‌లో మిర్యాలగూడలో ఒక ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఉన్నదని లిఖిత తెలిపింది.



తను సాధించిన పతకాలతో లిఖిత

### లిఖిత సాధించిన పతకాలు

- 2022లో రంగోత్సవ్ సెలబ్రేషన్స్‌లో భాగంగా ముంబై వారు నిర్వహించిన జాతీయ స్థాయి కలర్ కాంటెస్ట్‌లో మెరిట్ అవార్డు సాధించింది.
- 2022లో సమగ్రశిక్ష అభియాన్ నల్లగొండ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో తృతీయ బహుమతి గెలుచుకుంది.
- కలాం యువ ఫౌండేషన్ వారు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవల్ డ్రాయింగ్ కాంపిటేషన్‌లో మెరిట్ అవార్డు పొందింది.
- 2023లో డ్రీమ్ ఆర్ట్ అకాడమీ విజయవాడ వారు నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించింది.
- 2023లో యంగ్ ఇన్వాయిస్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ వారు నిర్వహించిన ఆల్‌ఇండియా ఆర్ట్ కాంటెస్ట్‌లో మెరిట్ సర్టిఫికెట్ అందుకుంది.
- 2023లో శ్రీదర్శిని కళైకుడమ్ చెన్నై వారు నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రశంసా పత్రం అందుకుంది.
- 2023లో చోడవరం చిత్ర కళానిలయం విశాఖపట్నం వారు నిర్వహించిన ఆల్‌ఇండియా కాంటెస్ట్‌లో బంగారు పథకం సాధించింది.



కమటం లిఖిత వేసిన చిత్రాలు



# సాగుకు వరం.. గిరి వికాసం

## గిరిజన భూములకు ఉచితంగా నీటి వసతి కల్పన

- పొలాలకు బోర్లు, విద్యుత్, పంపుసెట్ల సదుపాయం
- ఉపాధి హామీ కింద భూమి అభివృద్ధి పనులు
- పండ్ల మొక్కల సరఫరా.. సాగులో మెళకువలు
- యాదాద్రి జిల్లాలో కొత్తగా 877 ఎకరాల్లో 153 బ్లాక్‌ల గుర్తింపు
- రూ.1.90 కోట్లు కేటాయించిన ప్రభుత్వం

యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ) : ఎస్టీ రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం గిరిజన వికాసం పథకాన్ని ప్రవేశపెట్టింది. గిరిజన భూములను సాగులోకి తీసుకురావడం, వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా తీసుకొచ్చిన ఈ పథకాన్ని గిరిజన సంక్షేమ శాఖ అమలు చేస్తున్నది. నగదు బదిలీ ద్వారా కాకుండా ప్రత్యక్షంగా గిరిజన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తున్నది. సొంతంగా బోరు, మోటరు, విద్యుత్ సౌకర్యం కల్పించుకోలేక మెట్ట పంటలు సాగు చేసుకునే గిరిజనుల భూములకు ఈ పథకం ద్వారా సాగు నీటి వసతి కల్పిస్తారు. గిరిజన రైతుల పొలాలకు బోర్లు వేయిస్తారు. బావులు తవ్విస్తారు. బోర్లు ఉన్న రైతులకు విద్యుత్ సదుపాయం కల్పిస్తారు. ఉపాధి హామీ పనుల ద్వారా బండ రాళ్లు, పిచ్చి మొక్కలు, స్టంప్‌లు, తొలగించి బంజరు భూములను సాగుకు యోగ్యంగా మారుస్తారు. పండ్ల మొక్కల సరఫరాతోపాటు సాగులో సలహాలు కూడా అందిస్తారు.



నారాయణపురం మండలం పల్లెగట్టుతండాలో బోరు వేసేందుకు సర్వే చేస్తున్న జియాలజిస్ట్

### నాడు ఇందిర జల ప్రభ బంద్..

గతంలో ఇందిర జల ప్రభ పథకం ఉండేది. ఈ పథకంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఏ మాత్రం పరిజ్ఞానం లేని వారికి బాధ్యతలు అప్పగించడం వల్ల కమీషన్లకు కక్కుర్తిపడి.. ఎక్కడపడితే అక్కడ బోర్లు వేశారనే ఆరోపణలు ఉన్నాయి. అవి ఎందుకూ పనికిరాకుండా పోయాయి. దీంతో ఆ పథకం వల్ల రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లింది. గిరిజన రైతులకు కూడా లబ్ధి చేకూరలేదు. దీంతో 2014 కంటే ముందు అది వివిధ కారణాలతో ఆగిపోయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత కేసీఆర్ ప్రభుత్వం గిరి వికాసం పథకం అమల్లోకి తీసుకొచ్చింది. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా అమలు చేస్తున్నది.

### అర్హులు ఎవరంటే..

ఈ పథకం కింద గిరిజన రైతులను గుర్తించి, వారి భూముల్లో జియాలజిస్ట్ సర్వే చేస్తారు. ఆయన సిఫార్సు చేసిన చోట బోరు బావి తవ్వించి, విద్యుత్ సదుపాయం కల్పించి మోటరు పంపుసెట్లను బిగిస్తారు. అవసరమైన చోట భూమి అభివృద్ధి పనులు, సహజ వనరుల యాజమాన్యం పనులు చేపడుతారు. ఈ పథకానికి గిరిజనులే అర్హులు. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ వ్యక్తులను కలిపి ఒక బ్లాక్‌గా గుర్తిస్తారు. ఒకే కుటుంబానికి చెందిన వారై ఉండకూడదు. ఒక బ్లాక్‌లో ఐదెకరాలకు మించి భూమి ఉండాలి. ఒక బ్లాక్‌కు చెందిన భూమి కంటిన్యూగా ఉండాలి. షెడ్యూల్డ్ తెగల వారికి సంబంధించిన అసైన్డ్, పట్టా భూములు కూడా పరిగణలోకి తీసుకుంటారు.



బోరును పరిశీలిస్తున్న అధికారులు

### 153 కొత్త బ్లాక్‌ల గుర్తింపు

గిరి వికాసం పథకం ద్వారా ఒక బోరు బావి తవ్వేందుకు రూ.65,825 చొప్పున చెల్లిస్తారు. లేదా బోరు బావి తవ్విన లోతు ఆధారంగా చెల్లింపులు ఉంటాయి. విద్యుదీకరణకు విద్యుత్ శాఖ అంచనాల మేరకు నిధులు విడుదల చేస్తారు. మోటర్ పంపు సెట్లు సరఫరా చేసేందుకు టెండర్ ద్వారా సరఫరాదారులను గుర్తిస్తారు. ఒక్కో మోటరు పంపుసెట్టుకు రూ.89,500 ఇస్తారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 877 ఎకరాల్లో 153 కొత్త బ్లాక్‌లను గుర్తించారు. ఇందులో 135 ఎకరాల్లో జియాలజిస్ట్ ద్వారా సర్వే చేశారు. 24 బ్లాక్‌ల్లో బోర్‌వెల్ డ్రిల్లింగ్ చేసేందుకు సిఫార్సు చేశారు. వీటిల్లో 18 బ్లాక్‌ల్లో ఇప్పటికే బోర్‌వెల్ డ్రిల్లింగ్ పూర్తయింది. మిగతా పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ పథకానికి సంబంధించి జిల్లాకు రూ.1,88,28,000 నిధులు కేటాయించారు. ఇందులో ఇప్పటి వరకు రూ.91,85,892 ఉపయోగించారు.

### బ్లాక్‌ల గుర్తింపునకు కమిటీలు

అర్హత కలిగిన భూములను గుర్తించి బ్లాక్‌లుగా ఏర్పాటు చేయడానికి మండలాల్లో అధికారులతో కమిటీలను ఏర్పాటు చేస్తారు. అందులో గ్రామీణాభివృద్ధి శాఖ పీఓ/ ఎంపీడీఓ/ ఏపీఓ, సహాయ గిరిజన శాఖాధికారి, తాసీల్దార్, విద్యుత్ శాఖ ఏఈ ఉంటారు. ఈ కమిటీ సభ్యులు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో సమన్వయం చేసుకుని గిరిజనుల భూములను గుర్తిస్తారు. ప్రత్యక్షంగా పర్యవేక్షించి.. బ్లాక్‌లుగా ఏర్పాటు చేస్తారు.

# సెల్‌ఫోన్ మాయలో ప్రమాదాలు

## ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్‌పై తీరు మారని జనం

### ప్రమాదాల్లో అధిక శాతం యువతే

**నేటి ఆధునిక జీవితంలో మనుషులకు సెల్‌ఫోన్‌తో వీడదీయరాని బంధం ఏర్పడింది. ప్రతి సెకను అంటి పెట్టుకొని ఉండాలన్న ఆసక్తి ఎక్కువ మందిలో కనిపిస్తున్నది. అయితే.. ఏ పరిస్థితుల్లో ఉన్నా కాల్ లిఫ్ట్ చేయాలనే ఆతృత అనేక అనర్థాలకు దారి తీస్తున్నది. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరం, నేరమని తెలిసినా కొందరు మానడం లేదు. సెల్ ఫోన్ వాడుతూ ముందూ వెనుకా గమనించకుండా ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతున్నారు. ట్రాఫిక్ రద్దీలోనూ సెల్‌ఫోన్ మాట్లాడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. వారే కాకుండా ఎదుటి వారిని ప్రమాదంలోకి నెట్టి తీవ్ర నష్టాన్ని మిగుల్చుతున్నారు.**

– నేరేడుచర్ల, డిసెంబర్ 17

### ఇయర్ ఫోన్స్ వాడుతూ డ్రైవింగ్..

సెల్‌ఫోన్ అధిక వినియోగం యువత పాలిట శాపంగా మారుతున్నది. ప్రమాదాల బారిన పడి తల్లిదండ్రులకు కడుపు కోత మిగుల్చుతున్న ఘటనలు కోకొల్లలు. చెవుల్లో ఇయర్ ఫోన్స్, బ్లూటూత్ పెట్టుకొని పరధ్యానంగా డ్రైవ్ చేసేవారు చుట్టుపక్కల శబ్దాలు వినిపించక ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇయర్ ఫోన్స్ వాడేవారు డ్రైవింగ్ చేసేటప్పుడు ఎక్కువగా సంగీతం వింటూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలా వాహనాలు నడపడంతో అమాయక ప్రజలు బలవుతున్నారు.



### సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం నేరం



సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చట్టం 184(ఏ) ప్రకారం మొబైల్స్, ఇయర్ ఫోన్స్ పెట్టుకొని మాట్లాడుతూ వాహనాలు నడిపితే రూ.500 జరిమానా విధిస్తారు. అదే వ్యక్తి రెండోసారి పట్టుబడితే వెయ్యి రూపాయల జరిమానా వేస్తారు. మూడోసారి పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసే అవకాశం కూడా ఉన్నది. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇందులో యువతే అధిక శాతం ఉంటున్నారు. అటువంటి వారు ఒకసారి తమ కుటుంబాల గురించి ఆలోచించుకోవాలి.

**– పరమేశ్, నేరేడుచర్ల ఎస్ఐ**

# ఆధార్ అప్‌డేట్‌కు మరో అవకాశం

## మార్పులు, చేర్పులకు మార్చి 14వరకు గడువు

### ఆన్‌లైన్‌లో సొంతంగా చేసుకునే వెసులుబాటు



నేరేడుచర్ల/ హుజూర్‌నగర్, డిసెంబర్ 17 : నేటి సమాజంలో ఆధార్ కార్డు వినియోగం ఎంత కీలకంగా మారిందో ప్రతి ఒక్కరికీ తెలుసు. సిమ్ కార్డు కొనుగోలు మొదలు బ్యాంకు ఖాతాలు తెరువడం, వాహనాలు, ఇండ్లు, భూముల క్రయ విక్రయాలు.. ప్రభుత్వ పథకాలు, విద్యార్థులకు స్కాలర్‌షిప్ వంటి వాటికి ఆధార్ తప్పనిసరి అయ్యింది. అయితే.. వయసు పెరుగుతున్నా కొద్దీ వ్యక్తుల ముఖాల్లో తేడాలు వస్తుండడం సర్వసాధారణం. దీంతోపాటు ఇంటి చిరునామాలు మారుతుండడంతో అటు అధికారులు, ఇటు ఆధార్ కార్డుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని పరిష్కరించేందుకు ఆధార్‌లో మార్పులు, చేర్పులకు యూఐడీఏఐ ఎప్పటికప్పుడు అవకాశం కల్పిస్తూ వస్తున్నది. ఈ క్రమంలో గతేడాది డిసెంబర్ నుంచి మూడు నెలలపాటు ఉచితంగా మార్పులు, చేర్పులు చేసుకోవచ్చంటూ ప్రకటించింది. అయితే ప్రజలు అంతగా ఆసక్తి కనబర్చకపోవడంతో ఆశించిన మేర మార్పులు చేసుకోలేదు. ఈ నేపథ్యంలో మరో మూడు నెలలు గడువు పొడిగిస్తూ ఈ నెల 14వరకు అవకాశం ఇచ్చింది. అయినా.. ఇంకా పదేండ్ల గడువు ముగిసిన వారు భారీ సంఖ్యలోనే ఉండడంతో మరోసారి ఆధార్ అప్‌డేట్‌కు గడువు పొడిగించింది. వచ్చే ఏడాది మార్చి 14 వరకు ఆధార్‌లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించింది.

### మార్పులు ఇలా..

చాలా ఏండ్లుగా ఆధార్‌లో కొన్ని మార్పులకు యూఐడీఏఐ అవకాశం కల్పించలేదు. అందులో ప్రధానంగా 2010–18 వరకు ఆధార్ నమోదు చేసుకున్న కార్డుదారులు బంధుత్వాల్లో మార్పులు చేసుకోవాల్సి ఉన్నది. తండ్రి (సన్ ఆఫ్), భర్త (వైఫ్ ఆఫ్) వంటి వాటిని ఇప్పుడు మార్చుకోవచ్చు. ప్రస్తుతం దీనికి ఆయా స్థానాల్లో కేరాఫ్‌గా కొనసాగిస్తున్నారు. ఆధార్ నవీకరణ బంధుత్వాల మార్పుతోపాటు ఫోన్ నెంబర్లు, పుట్టిన తేదీ, ఫొటో, చిరునామా వంటివి అప్‌డేట్ చేసుకోవచ్చు. ఇందుకోసం ప్రజలు తమ పదో తరగతి, పాన్, ఓటర్ కార్డు, పాస్‌పోర్టు ఏదో ఒకటి జతపర్చాలి. ఇందులో చిన్నారులకు వారి తల్లిదండ్రుల చేతి ముద్రలతో ఆధార్ కార్డు జారీ చేశారు. వారికి ఐదేండ్లు పూర్తయ్యాక వారి వేలిముద్రలు, ఫొటోలను అప్‌డేట్ చేసుకోవాలి. దీనిపై చాలా మందికి అవగాహన లేక ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల జనన ధ్రువీకరణ పత్రంలోనూ అప్‌డేట్ చేయించుకోవాలి. కాగా, 70 ఏండ్లు దాటిన వారికి అప్‌డేట్ నుంచి మినహాయింపు కల్పించారు. ఎలాంటి రుసుము చెల్లించకుండా ఆన్‌లైన్‌లో ఆధార్ కార్డును స్వతహాగా అప్‌డేట్ చేసుకోవచ్చు. కంప్యూటర్ పట్ల అవగాహన ఉన్నవారు మై ఆధార్ పోర్టల్, ఎం–ఆధార్ యాప్ ద్వారా అప్‌డేట్ చేసుకోవచ్చు. అలాగే మండలాల్లోని శాశ్వత ఆధార్ కేంద్రాల్లోనూ మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు.

చిన్నారులకు కార్డు తీసుకొని ఐదేండ్లు దాటితే వేలి ముద్రలు, ఫొటోలను కూడా అప్‌డేట్ చేసుకోవచ్చు.

పోస్టాఫీసులు, బ్యాంకులు, శాశ్వత ఆధార్ కేంద్రాల్లో తగిన డాక్యుమెంట్లు అందజేసి అప్‌డేట్ చేసుకోవాలి. పదేండ్ల కింద ఆధార్ కార్డు పొందిన వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విశిష్ట గుర్తింపు ఉపాధికార సంస్థ (యూఐడీఏఐ) సూచిస్తున్నది. గడువు ముగిసిన అనంతరం అప్‌డేట్‌తోపాటు ఫొటో, నివాసం, ఇతర మార్పులు, చేర్పులు చేసుకోవాలంటే విధిగా 50 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే.. ఆధార్ అప్‌డేట్ కోసం మీసేవ కేంద్రాల్లో రుసుము వసూళ్లపై నిబంధనలు జారీ చేశారు. బయోమెట్రిక్ అప్‌డేట్‌కు రూ.100, డెమోగ్రాఫిక్‌కు రూ.50, ఆధార్ డౌన్‌లోడ్, కలర్ ప్రింట్‌కు రూ.30 చెల్లించాలి. ఇందులో ఏమైనా సమస్యలు తలెత్తితే టోల్ ఫ్రీ నంబర్ 1947లో సంప్రదించవచ్చు.



మీసేవ సెంటర్‌లో అప్‌డేట్ చేసుకుంటున్న చిన్నారి

### ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసుకోండిలా..

https:// myaadhaar.uidai.gov.in పోర్టల్‌లో ఆధార్ నంబర్ ద్వారా లాగిన్ కావాలి. ప్రొసీడ్ టు అప్‌డేట్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఆధార్ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్ చేసిన అనంతరం డాక్యుమెంట్ అప్‌డేట్ ఆప్షన్‌ను క్లిక్ చేస్తే స్క్రీన్‌పై వివరాలు వస్తాయి. వాటిని పూర్తిగా పరిశీలించి సవరణ ఉంటే చేయాలి. లేదంటే ఉన్న వివరాలతోనే నెక్స్ట్‌పై క్లిక్ చేయాలి. కిందికి స్క్రోలింగ్ చేస్తే వచ్చే ప్రూఫ్ ఆఫ్ ఐడెంటిటీ, ప్రూఫ్ ఆఫ్ అడ్రస్ డాక్యుమెంట్లను ఎంచుకోవాలి. ఆయా డాక్యుమెంట్లను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి. ఆ తర్వాత సబ్మిట్ బటన్‌పై క్లిక్ చేస్తే అప్‌డేట్ పూర్తయినట్లు ఫోన్ నెంబర్‌కు పద్నాలుగు అంకెల అప్‌డేట్ రిక్వెస్ట్ నెంబర్ వస్తుంది. దీని ద్వారా స్టేటస్ తెలుసుకోవచ్చు.